హైటెన్షన్ వైర్లు తొలగించాలని డిప్యూటీ సీఎంకు వినతి


డిప్యూటీ సీఎంకు విన్నవిస్తున్న తార్నాక వాసులు

లాలాపేట: తార్నాక స్ట్రీట్ నంబర్–11లో హైటెన్షన్ విద్యుత్ వైర్లను తొలగించాలని తార్నాకవాసులు కోరారు. ఈమేరకు సికింద్రాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక నేతలు తార్నాక డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్. బ్రహ్మజీ, టీపీసీసీ సెక్రటరీ అమర్‌నాథ్‌గౌడ్, బాధితులు దుర్గయ్య, బాల్‌రాజ్, రమేశ్‌కుమార్, శ్రీనివాస్, హనుమంతు, శషాంక్, పవన్‌కుమార్, గోపాల్, కృష్ణ తదితరులు గాంధీ భవన్‌లో గురువారం జరిగిన మంత్రులతో ముఖాముఖీ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రిని కలిసి విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ నివాసాలపై ఉన్న 32 కేవీ హైటెన్షన్ వైర్లతో దాదాపు 50 ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నామన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరిగి పలువురు మరణించారని పేర్కొన్నారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం కూడా సానుకూలంగా స్పందించారని బాధితులు తెలిపారు.

సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలంతా సహకరించాలి


సర్వేలో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

సికింద్రాబాద్: సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలంతా సహకరించాలని రాజ్యసభ ఎంపీ మందాడి అనిల్‌కుమార్‌యాదవ్ కోరారు. సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండు, బ్రాహ్మణబస్తీ, ఉప్పరబస్తీ ప్రాంతాల్లో గురువారం నిర్వహించిన సర్వేను పరిశీలించారు. ఎన్యుమరేటర్లతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ వివరాల నమోదు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ వివరాలు అందిస్తేనే అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సులభతరంగా అందే అవకాశం ఉంటుందన్నారు. సర్వే విషయంలో ప్రతిపక్షాల నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. గత ప్రభుత్వ పదేళ్ల హయాంలో ప్రభుత్వ ఫలాలు కొన్ని వర్గాల ప్రజలకు మాత్రమే పరిమితం అయ్యాయని, ప్రస్తుత సర్వే ఫలితంగా అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జగదీశ్వర్‌రావు, సురేశ్‌లాల్, నాయకులు జహంగీర్, యాదగిరి, జగదీశ్, కరీం, పాపాలాల్ పాల్గొన్నారు.

కిరాయి ఇస్తానంటూ కార్లు తీసుకుని ఘరానా మోసం

వెంగళరావునగర్: కిరాయి ఇస్తానంటూ కార్లు తీసుకుని ఘరానా మోసానికి పాల్పడిన ఇరువురిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. కోనసీమ జిల్లాకు చెందిన జీ సూర్యతేజ ఆరేళ్లుగా తమ జిల్లాలో ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. ఇటీవల తన స్నేహితుడు శ్రీను అతని స్నేహితుడైన అరవింద్‌కు పరిచయం చేశాడు. అరవింద్ తన స్నేహితుడు మధు కార్లు అద్దెకు తీసుకుని ప్రతినెల పెద్ద మొత్తంలో కిరాయి ఇస్తుంటాడని తెలిపారు. దాంతో సూర్యతేజ తన కారును మధుకు ఇచ్చి అగ్రిమెంట్ రాయించుకున్నాడు. అతనికి మూడు నెలలు కిరాయి అందించాడు. ఇంకా కార్లు ఉంటే చెప్పాలని వారికి కూడా రూ. 40 వేల చొప్పున చెల్లిస్తానని అనగా సూర్యతేజ తనకు తెలిసిన దాదాపు 10 మంది స్నేహితులకు చెప్పి వారి కార్లను మధుకు ఇప్పించాడు. ఒకటి రెండు నెలలు బాగానే ఉన్నప్పటికీ తర్వాత కిరాయి ఇవ్వలేదు. ఈ క్రమంలో రెండు రోజుల కిందట కారు ఇచ్చిన ఓ మహిళ నగరానికి వచ్చి తన కారు లోకేషన్ శంషాబాద్‌లో ఉన్నట్లుగా గుర్తించి అక్కడకు వెళ్లింది. ఆమె కారు బేకరీ షాపు ముందు ఉండగా అక్కడకు వెళ్లి ఆరా తీసింది. బేకరీషాపు యజమాని ఈ కారును మధు అనే వ్యక్తి రూ. 1.20 లక్షలకు మార్టిగేజ్ చేసి తనకు ఇచ్చాడని తెలిపాడు.
దాంతో ఆమెతోపాటు బాధితులు మధుకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తమను మోసం చేసిన మధు, అరవింద్‌పై చర్యలు తీసుకోవాలని బాధితులు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి

ముషీరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి సమస్యలను వివరించి న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా పని చేస్తానన్నారు. గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మహాత్మానగర్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు బిజ్జి కనకేష్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు ఆయనను కలిసి సమస్యలను వివరించారు. అనంతరం మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. మత్స్యకారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ ఫెడరేషన్ డైరెక్టర్ నాగమణి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకోవాలని నోటీసులివ్వడం సరికాదు


కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

మూసాపేట: ఒక భవన సముదాయంలో 10 విద్యుత్ మీటర్లు దాటితే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలని ఫతేనగర్ డివిజన్ పరిధిలోని సమతానగర్‌లో అధికారులు నోటీసులివ్వడం సరికాదని కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అన్నారు. టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారులు దాదాపు 20 భవనాలకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలని నోటీసులివ్వడంతో కాలనీ వాసులు గురువారం కార్పొరేటర్‌ను కలిసి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాణ్యమైన కరెంట్‌ను ఇస్తూ ఏ రోజూ ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా చర్యలు తీసుకోలేదన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన పది నెలల్లోనే కరెంట్ సరిగ్గా ఇవ్వకపోగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకోవాలని మధ్య తరగతి కుటుంబాలు ఎక్కువగా ఉన్న బిల్డింగ్ యజమానులకు నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఆందోళనలు నిర్వహిస్తామన్నారు.

అక్రమ కట్టడాలపై సత్వర చర్యలు

- ప్రజా ఫిర్యాదులపై తక్షణ స్పందన
- పురాతన భవనాల యజమానులకు నోటీసులు
- ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు నిరంతర ప్రక్రియ
- అవినీతి అక్రమాలను సహించం

'సాక్షి' ఇంటర్వ్యూలో జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఆర్ సుస్మిత



బన్సీలాల్‌పేట్: అక్రమ నిర్మాణాలపై సత్వర చర్యలు తీసుకుంటుకున్నామని జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఆర్. సుస్మిత పేర్కొన్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగం పనితీరును మరింత మెరుగుపరుస్తూ కింది స్థాయి సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించేలా దిశానిర్దేశం చేస్తూ నూతన భవన నిర్మాణాలకు యుద్ధప్రాతిపదికన అనుమతులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. అలాగే నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్మాణాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇటీవలే జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టగా ఆమెతో 'సాక్షి' ఇంటర్వ్యూ..

సాక్షి: టౌన్‌ప్లానింగ్ కార్యకలాపాల గురించి వివరించండి..?

ఏసీపీ: టౌన్‌ప్లానింగ్ విభాగం ద్వారా నూతన భవనాల నిర్మాణాలకు అనుమతుల మంజూరు, అలాగే నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే కట్టడాల తొలగింపు ఇతరత్రా సమస్యల పరిష్కారానికి ఈ విభాగం పనిచేస్తుంది. నూతన నిర్మాణాల కోసం వచ్చే దరఖాస్తులు సక్రమంగా ఉంటే ఒకటి, రెండు రోజుల్లోనే అనుమతులు మంజూరు చేస్తున్నాం. తమ పరిధిలో జీ+3 వరకు మాత్రమే పర్మిషన్ ఇస్తున్నాం.

సాక్షి: అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

ఏసీపీ: అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తే సత్వర చర్యలు తీసుకుంటున్నాం. నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే వారికి నోటీసులు జారీ చేస్తున్నాం. అనంతరం వాటిని స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీం ద్వారా కూల్చివేయిస్తున్నాం. అధికారి పలువురు సిబ్బంది ఆయా ప్రాంతాల్లో పర్యటించి అక్రమ కట్టడాలను గుర్తిస్తారు. అక్రమ నిర్మాణాల విషయంలో ఒత్తిళ్లకు లొంగకుండా విధులు నిర్వర్తిస్తున్నాం.

సాక్షి: ఫుట్‌పాత్ ఆక్రమణలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలపై మీ స్పందన..?

ఏసీపీ: ఫుట్‌పాత్ ఆక్రమణలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఇప్పటికే సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన డబ్బాలు, ఇతర వ్యాపార సముదాయాలను తొలగిస్తున్నాం. దీనిని నిరంతరాయంగా కొనసాగిస్తాం. ఎక్కడైన ఫుట్‌పాత్‌ల ఆక్రమణ జరిగి పాదచారులకు ఇబ్బందులు కలిగినట్లు ఫిర్యాదు వస్తే సత్వర చర్యలు తీసుకోవాలని తమ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం.

సాక్షి: పురాతన భవనాల తొలగింపుపై ఏం చర్యలు తీసుకుంటున్నారు..?

ఏసీపీ: వర్షాకాలంలో పురాతన భవనాల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. బేగంపేట సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు సుమారు 60 శిథిల భవనాలను గుర్తించినం. సదరు యజమానులకు నోటీసులు కూడా జారీ చేసినం. ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా వాటికి మరమ్మతులు చేపట్టాలని లేకుంటే కూల్చివేయాలని సూచిస్తున్నాం. పలువురికి నోటీసులు ఇవ్వగా వారు మరమ్మతులు కూడా చేసుకుంటున్నారు. పలు భవనాలు ఓనర్, టెనెంట్ మధ్య వివాదాల కారణంగా కోర్టు కేసుల్లో ఉన్నాయి.

సాక్షి: ప్రజా ఫిర్యాదులను ఎలా పరిష్కరిస్తున్నారు..?

ఏసీపీ: ప్రతిరోజు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నాం. సమస్య తీరుతెన్నులను బట్టి అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనలకు లోబడి అక్కడికక్కడే వాటికి పరిష్కారం చూపుతున్నాం. వాస్తవాలను ప్రజలకు వివరించి ఆ దిశగా నిర్దిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతున్నాం. ఒత్తిళ్లకు లొంగకుండా నిర్భయంగా..నిజాయతీగా విధులు నిర్వహిస్తున్నాం.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



సనత్‌నగర్: లోధా, ఈఎస్ఐ, ఆల్విన్, కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సనత్‌గర్ ఇండస్ట్రీయల్ ఏరియా, అల్లావుద్దీన్ కోఠి, లిక్కర్ కంపెనీ, జయభారతి సూకల్, శ్రీరామ్‌నగర్, దాసారం బస్తీ, సీ–టైప్ క్వార్టర్స్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్, పోలీస్ క్వార్టర్స్, 3ఆర్‌టీ, ఫతేబాగ్, సనత్‌నగర్ మెయిన్‌రోడ్డు, ఉమానగర్, వైట్ హౌస్, కుందన్‌బాగ్, ట్రాన్సిస్ట్ హాస్టల్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఐబీసీటీ సబ్‌స్టేషన్ పరిధిలో..

రాంగోపాల్‌పేట్: ఐబీసీటీ సబ్‌స్టేషన్ పరిధిలోని శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ప్యారడైజ్ సీబీడీ ఏడీఈ ఆదినారాయణ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బెక్కన్ ఫీడర్ పరిధిలోని షిర్డీసాయినగర్, బ్యాంక్ ఆఫ్ బరోడా, స్ట్రీట్ నంబర్ 1, సూర్యవంశీ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కిమ్టీ కాలనీ, స్ట్రీట్ నంబర్1, సుదర్శన్ రెడ్డి స్వీట్ షాప్, చిల్డ్రన్ హాస్పిటల్, సన్మాన్ హోటల్ తదితర ప్రాంతాల్లో కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన


సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

అడ్డగుట్ట: నార్త్ లాలాగూడ ఇంద్రానగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ పద్మలత, ఏఈ ఆశిష్ తివారీ, బీఆర్ఎస్ నేతలు లింగాని శ్రీనివాస్, సత్తయ్య, దాసరి శ్రీను, అమర్, గోనె, రమేశ్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ డ్రెయిన్ పనులు..

చిలకలగూడ : సీతాఫల్‌మండి ఏక్‌నంబర్‌గల్లీ వద్ద నిర్మిస్తున్న టేబుల్ డ్రెయిన్ పనులను కార్పొరేటర్ సామల హేమ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.50 లక్షల వ్యయంతో చిలకలగూడ చౌరస్తా నుంచి సీతాఫల్‌మండి వరకు ప్రధాన రహదారికిరువైపులా పనులు కొనసాగుతున్నాయన్నారు. వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురికాకుండా రోడ్డు, ఫుట్‌పాత్ మధ్య ఖాళీలను కాంక్రీట్‌తో భర్తీ చేస్తారని ప్రధాన రహదారికి ఆనుకున్న ఉన్న ఇళ్లు, షాపుల యాజమానులు సహరించాలని కోరారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆమె వెంట జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

మైనర్‌ను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు

వెంగళరావునగర్: మైనర్ బాలికను వేధిస్తున్న యువకుడిపై మధురానగర్ పీఎస్‌లో పోక్సో కేసు నమోదైంది. పోలీసుల సమాచారం మేరకు.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఓ ప్రాంతంలో 15 ఏళ్ల బాలిక తన పేరెంట్స్‌తో కలిసి ఉంటుంది. కొంతకాలం కిందట ప్రవీణ్ అనే యువకుడు రహమత్‌నగర్‌లో నివాసం ఉండేవాడు. ఆ సమయంలో యువకుడికి ఆ బాలిక ఇన్‌స్టాగాంలో పరిచయం అయింది. స్నేహంగా ఉంటూ ఇన్‌స్టాగాం అకౌంట్, ఫోన్ నెంబర్ తీసుకున్నాడు. కొద్దిరోజుల తర్వాత తనను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకోవాలని బాలికను వేధించడం ప్రారంభించాడు. ఇటీవల అతను కర్నూలు జిల్లాకు వెళ్లాడు. అయినా ఆ బాలికను వేధిస్తూనే ఉన్నాడు. ప్రవీణ్ వేధింపులు తాళలేక బాలిక మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బౌద్ధనగర్‌లో జెండావిష్కరణ


జెండావిష్కరణలో గంగపుత్ర సంఘం నాయకులు

బౌద్ధనగర్: ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా గంగపుత్ర స్థానిక సంఘం, గంగపుత్ర సంక్షేమ సంఘం, గంగపుత్ర సొసైటీల ఆధ్వర్యంలో బౌద్ధనగర్‌లో గురువారం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు దేశబోయిన రఘు మాట్లాడుతూ చేపల వేట తమ జన్మహక్కు అని, గంగపుత్రులు ఐక్యమత్యంతో ఉండాలని కోరారు. యేటా నవంబర్ 21న గంగపుత్ర జెండా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకోవాలి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కర్మకొండ సత్యనారాయణ, చల్లూరు సంజీవ్, కుర శంకరయ్య, పారుపల్లి నరహరి, పాక సత్యనారాయణ, రాజ్‌కుమార్, మల్లేశం, రమేశ్, ముద్రగడ శివ తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీని కలిసిన దిశ కమిటీ మెంబర్


ఏసీపీ జైపాల్‌రెడ్డితో శారదామల్లేశ్, బీజేపీ నాయకులు

సికింద్రాబాద్ జిల్లా అభివృద్ధి, సమన్వయ నిర్వహణ కమిటీ (దిశ) మెంబర్‌గా నియమితులైన బీజేపీ నేత శారదామల్లేశ్ చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలు, శాంతిభద్రతలపై చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా నాయకులు మద్దెర్ల శ్యాం సుందర్, ప్రభుగుప్తా, వీరేశ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు విద్యార్థులు జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తన కార్యాలయంలో చీఫ్ వార్డెన్ కొర్రెముల శ్రీనివాస్‌రావుకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెస్‌లో నాణ్యతపై దృష్టిపెట్టాలని, హాస్టల్స్‌ను, భోజనశాలలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జార్జిరెడ్డి పీడీఎస్‌యూ నేతలు నాగేశ్వర్ రావు, సుమంత్, రుక్మత్‌పాషా, వెంకటేశ్, అంజి పాల్గొన్నారు.

రేపు హైదరాబాద్ కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ


భీమయ్య గౌడ్, మారేడ్‌పల్లి తహసీల్దార్

అడ్డగుట్ట: ఈనెల 23న లక్డీకపూల్‌లోని హైదరాబాద్ కలెక్టరేట్‌లో తెలంగాణ వెనకబడిన తరగతుల కమిషన్ ఆధ్వర్యంలో బహిరంగ విచారణల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మారేడ్‌పల్లి మండల తహసీల్దార్ భీమయ్య గౌడ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో సామాజికంగా, విద్యాపరంగా, వెనుకబడిన తరగతుల పరిస్థితులను తెలుసుకుని వారి అభ్యున్నతికి కమిషన్ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. వెనుకబడిన తరగతుల ప్రజలు హాజరై తమ అభ్యర్థనలు, వినతులు, సలహాలు, సూచనలు కమిషన్ చైర్మన్ నిరంజన్‌తో పాటు కమిటీ సభ్యులకు విన్నవించుకోవాలని సూచించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.31, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 35, బెండకాయ 35, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 40, క్యాప్సికం 55, పచ్చకాకర 20, పందిరి బీర 32, క్యాబేజీ 26, క్యారెట్ 55, దొండ 23, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 50, గోకరకాయ 28, కీర 13, దోసకాయ 28, బీట్‌రూట్ 50, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 36, చామగడ్డ 35, మొరంగడ్డ 28, కందగడ్డ 50, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

27న ప్రేయర్ డేను విజయవంతం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఈనెల 27న ఎల్బీ స్టేడియంలో ప్రేయర్ డేను నిర్వహించనున్నట్లు పలువురు క్రైస్తవులు పేర్కొన్నారు. ఓయూ జేఏసీ చైర్మన్ గడ్డం అశోక్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలనే ఉద్దేశంతో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ప్రేయర్ డే కార్యక్రమానికి కుల, మతాలకు అతీతంగా విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ప్రొ.నతనీయేలు, జాన్, యాదగిరి, మురళీ, మహేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు.. ఆపై మురుగు..!


బీకేగూడ వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

అమీర్‌పేట: సనత్‌నగర్ డివిజన్ బీకేగూడ, సంజేయ్‌గాంధీనగర్‌లో ప్రధాప రహదారితో పాటు అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతలమయంగా మారడమే కాకుండా తరుచూ డ్రైనేజీ నీరు గుంతల్లో నిలిచి ఉండడంతో రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గత ప్రభుత్వ హయంలో నూతనంగా రోడ్లు వేసేందుకు నిధులు మంజూరు కాగా దాదాపు యేడాది క్రితం రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పటివరకు పనులు చేపట్టడంలో జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పనులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

బోరబండ.. సమస్యలు స్టేషన్ నిండా

- నిత్యం ఆకతాయిల తిష్ట
- సమయపాలన లేని రైళ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ఎంఎంటీఎస్ స్టేషన్‌లో సౌకర్యాల లేమి


రైల్వే స్టేషన్ బయట మరమ్మతులకు నోచుకోని బస్ బే ప్రాంతం

ప్రజల సౌకర్యార్థం రెండు దశాబ్దాల క్రితం నాటి కేంద్ర ప్రభుత్వం అల్లాపూర్, మూసాపేట డివిజన్లలోని బోరబండ, భరత్‌నగర్ రైల్వే స్టేషన్లను ఏర్పాటు చేసింది. అయితే సరైన సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మూత్రశాలలు కూడా సరిగ్గా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులు కూర్చునే సీట్లు సైతం అధ్వానంగా తయారయ్యాయి. అధికారుల నిఘా లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. పరిసరాలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా స్టేషన్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– మోతీనగర్


బోరబండలోని ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ ప్రవేశద్వారం

సమస్యలు పరిష్కరించాలి



ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ ఆకతాయిలకు అడ్డాగా మారింది. రాత్రి అయితే చాలు భయంతో వెళ్లాల్సి వస్తోంది. స్టేషన్ నుంచి తమ ఇళ్లకు నడుచుకుంటూ వెళ్లాలి. వీధి లైట్లు సైతం అక్కడక్కడ మాత్రమే ఉన్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బోరబండ, భరత్‌నగర్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి.

– చోటా మోయిస్, పండిట్ నెహ్రూనగర్

ఆకతాయిలకు అడ్డాగా..

బోరబండ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ ఆకతాయిలకు అడ్డాగా మారింది. మద్యం, గంజాయి వంటి వాటిని సేవిస్తూ ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. ఎవరైనా ఎదురుతిరిగితే దాడులకు సైతం వెనుకాడడం లేదు. అదేవిధంగా స్టేషన్ ఆవరణలో ఉన్న ముఖ ద్వారాలు సైతం ధ్వంసమయ్యాయి. గతంలో బోరబండ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లడానికి ఆర్టీసీ బస్సులు సైతం ఉండేవి. ప్రయాణికులు వేచి ఉండటానికి బస్ స్టేషన్ బయట నిర్మించారు. బస్ షెల్టర్ వస్తువులను కూడా గుర్తు తెలియని వ్యక్తులు తస్కరించారు. పరిసరాలు చెత్తాచెదారానికి నిలయంగా మారింది. పార్కింగ్ నిర్వహణ కూడా లేకపోవడంతో అడ్డదిడ్డంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ప్రతి అరగంటకు ఎంఎంటీఎస్ రైలు బోరబండ, భరత్‌నగర్ మీదుగా సికింద్రాబాద్, ఫలక్‌నామా, నాంపల్లికి నడిచేవి. ప్రస్తుతం సమయపాలన లేక చాలామంది నిరుద్యోగులు, ఉపాధి కోసం వెళ్లే కూలీలు బస్సుల్లో వెళ్తున్నారు. దీంతో అధిక చార్జీలు ఖర్చు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకటి పడితే చాలు జేబు దొంగల ఆగడాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. అదేవిధంగా మూసాపేట డివిజన్ భరత్‌నగర్ రైల్వేస్టేషన్ ఒక వైపు బహిరంగ స్థలాలు ఉండడంతో చెట్ల పొదల్లో ఆకతాయిలు తిష్టవేసి మహిళలు, ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత రైల్వే అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి యథావిధిగా రైల్వేస్టేషన్‌కు బస్సులు నడపాలని అదేవిధంగా స్టేషన్‌కు ఒకవైపు ఉన్న టికెట్ కౌంటర్లను రెండు వైపులా ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.


చెత్తాచెదారం, కలుపు మొక్కలతో బోరబండ రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు